# అమెరికా ప్రమేయంతో శాశ్వతంగా మారనున్న ఇజ్రాయిల్, ఇరాన్‌ల నడుమ నిరంతర ఘర్షణలు

**ఇరాన్‌లో** 1979 నాటి ఇస్లాం విప్లవానికి ముందు, ఇరాన్-ఇజ్రాయిల్ దేశాలు రెండూ మిత్ర దేశాలుగా ఉండేవి. తదనంతరం, విప్లవ కొనసాగింపుగా ఇరాన్ ప్రభుత్వంలో మార్పులు జరిగి, ఇజ్రాయిల్‌ను తీవ్రంగా వ్యతిరేకించే వైఖరి చేపట్టింది. ఇది రెండు దేశాల నడుమ సంబంధాలను మౌలికంగా మార్చివేసింది. ప్రపంచ దృక్కోణంలో ఇజ్రాయిల్, పశ్చిమ వలసవాదుల స్థావరంగా, సామ్రాజ్యవాదపు మరో రూపమైన జాత్యహంకార దేశంగా రూపొందింది. ఆనాడు అనేక అరబ్ దేశాలు ఒక యూదు రాజ్యంగా మనుగడ సాగించేందుకు కూడా, ఇజ్రాయిల్‌కు హక్కు లేదన్నాయి. ఇజ్రాయిల్‌తో ఈజిప్టు చేసుకున్న శాంతి ఒప్పందాన్ని రాడికల్స్ వ్యతిరేకించి, 'రిజెక్షనిస్ట్ ఫ్రంట్' (తిరస్కరణ ఫ్రంట్)గా పిలవబడే దానిని ఏర్పరిచారు. ముస్లిం లేదా అరబ్ భూభాగాలను ఆక్రమించి, పాలస్తీనీయులను తమ మాతృభూమి నుండి విస్తాపనకు గురిచేసిన చట్టవిరుద్ధ రాజ్యంగా ఇజ్రాయిల్‌ను, ఇరాన్ ఇస్లాం తత్వం గ్రహించింది. అరబ్ రాజ్యాల నడుమ ఒకరిపై ఒకరికున్న విభేదాలను అనుకూలంగా చేసుకొని, శక్తివంతమైన వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఆశిస్తూ, ఇరాన్ మరియు అరబ్ రాజ్యాల నడుమ ఏదో విధంగా ఉద్రిక్తతలను కొనసాగిస్తూ ఉండేందుకు ఇజ్రాయిల్ చారిత్రకంగా దోహదపడింది.

2002లో ప్రారంభించిన ఇరాక్ అణు కార్యక్రమంపై ఇజ్రాయిల్ దృష్టి సారించింది. ఇరాన్ కంటే ఇరాక్ అధునాతనంగా ముందు కెళ్తున్నట్లుగా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) భావించే విధంగా వ్యవహరించింది. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడులు సాగించిన తర్వాత, జనహనన ఆయుధాలను ఇరాక్ కలిగి వుందన్న తన ఆరోపణలు తప్పుడు ప్రకటనలుగా తేలిపోయాయి. కొందరు ఇజ్రాయిలీ నాయకులు ఇరాక్‌పై అమెరికా సైనిక దాడికి తోడ్పడ్డారు. గతకాలపు సోవియట్ రిపబ్లిక్‌లయిన, ప్రత్యేకించి అజర్ బైజాన్‌తో ఇరాన్‌తోపాటు తీవ్రంగా పోటీ పడుతూనే మరోవైపున ఇరాన్‌కు వ్యతిరేకంగా అజర్ బైజాన్‌తో ఇజ్రాయిల్ ఒక కూటమిని ఏర్పరిచింది. ఈ మధ్యలో ఇరాన్, ఇజ్రాయిల్‌కు సమీప ప్రాంతాలలో ప్రత్యేకించి సిరియాలో తన ప్రభావాన్ని పెంచుకుంటూ, 2011 నాటి అంతర్యుద్ధం అందించిన ప్రారంభాన్ని చేజిక్కించుకుంది. ఇరాన్, టర్కీ, సౌదీ అరేబియా, ఇజ్రాయిల్ దేశాలన్నీ ప్రాంతీయ ఆధిపత్యం కోసం పోటీపడేవే. అయితే, ఆ విధమైన ఆధిపత్యం వారిలో ఎవరికీ దక్కే అవకాశం లేకపోయినప్పటికీ, అవి పోటీ పడుతున్నాయి.




2023 డిసెంబర్ 25న సిరియా రాజధాని డమాస్కస్ పొలిమేరల్లో, ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడులలో, ఇరాన్ దేశానికి చెందిన సిరియాలోని 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్' (ఐఆర్జిసి) ఉన్నత స్థాయి కమాండర్, సీనియర్ సలహాదారుడైన సయ్యద్ రజి మౌసావి మరణించినట్లుగా ఇరాన్ దేశ మాధ్యమాలు తెలుపుతున్నాయి. సిరియా, ఇరాన్‌ల నడుమ సైనిక కూటమిని సమన్వయం చేయటంలో మౌసావి, ఒక గుర్తించ దగిన పాత్ర పోషించాడు. ఫలితంగా 2024 జనవరి 15న ఇరాక్ ఉత్తరాన కుర్దుల ప్రాంతమైన హెర్బిల్‌లోని ఇజ్రాయిల్‌కు చెందిన మసాద్ గూడచారి సంస్థగా చెప్పబడుతున్న స్థావరంపై ఐఆర్జెసి ఖండాంతర క్షిపణులను ప్రయోగించింది. హెర్బిల్లో కనీసం 8 పేలుళ్ల శబ్దాలు వినవచ్చాయి; ఈ దాడిలో నలుగురు ప్రజలు మరణించారు. 2024 ఏప్రిల్ 1న డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయిల్ దాడి చేసింది. 2024 ఏప్రిల్ 13న హార్మోజ్ జల సంధి సమీపాన ఇజ్రాయిల్‌తో సంబంధాలు ఉన్న ఓ నౌకను ఇరాన్‌కు చెందిన ఐఆర్జిసి స్వాధీన పరుచుకుంది. మరోవైపున ఆపరేషన్ 'ట్రూ ప్రామిస్'గా ఇరాన్ చెబుతున్న దాడిలో, ఇజ్రాయిల్ పై 300కు పైగా డ్రోన్లను, క్షిపణులను ప్రయోగించింది. ఇరాన్ భూతలం నుండి ఇజ్రాయిల్‌పై నేరుగా దాడికి పాల్పడటం ఇదే మొదటిసారి. ఈ సందర్భంలో ఇజ్రాయిల్ ఇరాన్‌ల నడుమ ఉద్రిక్తతలు నిరంతరంగా తీవ్రమవుతున్నాయి. 2024 ఏప్రిల్ 21న అమెరికా ప్రతినిధుల సభ రెండు పక్షాల మద్దతుతో 95 బిలియన్ డాలర్ల శాసనబద్ధ ప్యాకేజీని ఆమోదించింది. ఉక్రెయిన్, ఇజ్రాయిల్, ఇండో పసిఫిక్ ప్రాంతాలు ఈ ప్యాకేజీలో లబ్ధి పొందే దేశాలుగా ఉన్నాయి. కొంతమంది రిపబ్లికన్ల నుండి చాలా గట్టి వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పటికీ, నెలల కాలపు ఆలస్యం తర్వాత ఈ బిల్లు విజయవంతంగా ఆమోదం పొందింది. అదే సందర్భంలో అమెరికా యుద్ధంలోకి లాగబడుతోందని ప్రెసిడెంట్ బైడన్ హెచ్చరించాడు; 'ఇజ్రాయిల్ మధ్యప్రాచ్యంలో మన అత్యంత

దృఢమైన భాగస్వామి... ఈ వారాంతంలో ఉద్దేశించిన విధ్వంసాన్ని ఇరాన్ కొనసాగించదలచిందా?, ఇజ్రాయిల్ తన రక్షణలో బలహీనపడితే, మనం వారి పక్షాన నిలబడతామనేది ఆలోచించాల్సిన అవసరమే లేని అంశం' అని పేర్కొన్నాడు. గత ఆరు నెలల పైగా కాలం నుండి ఇజ్రాయిల్ చేపట్టిన చర్యలతో గాజా సంఘర్షణ కొనసాగుతూ, అమాయకుల జీవితాలు నాశనం అయిపోతున్నాయి. దీనికి తోడుగా అమెరికా సామ్రాజ్యవాద చర్యలు... ఇజ్రాయిల్, ఇరాన్‌ల నడుమ ఆజ్యం పోస్తూ, ఉద్రిక్తతలను పెంచుతూ మరింత ఘర్షణకు దోవ తీసే అవకాశం కల్పిస్తున్నాయి.

★★★★★